క్లుప్తంగా

వైభవంగా భావనారాయణ స్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

కాకినాడ రూరల్: సర్పవరం భావనారాయణ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం పెద సింహ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అన్నమయ్య సంకీర్తనలు భక్తులను అలరించాయి. రాజ్యలక్ష్మీ అమ్మవారు, భావనారాయణ స్వామివారి దివ్య కల్యాణం ఆదివారం అర్ధరాత్రి వరకూ జరిగింది. కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకాలు నిర్వహించి అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ నెల 24వ తేదీ శుక్రవారం రాత్రి 7 గంటలకు సదస్య మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు.

అనధికారికంగా మట్టి తరలిస్తే చర్యలు



అదుపులోకి తీసుకున్న మట్టి ట్రాక్టర్లు

కరప: మండలంలో ఎవరైనా అనధికారికంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు హెచ్చరించారు. పెద్దాపురప్పాడు, యండమూరు గ్రామాల్లో మళ్లల్లోంచి మట్టి తరలిస్తున్నట్టు సోమవారం ఫిర్యాదు అందడంతో ఆర్ఐ పేపకాయల మాచరావుతో కలసి తహసీల్దార్ రామకోటేశ్వరరావు, పోలీసులు దాడులు చేశారు. యండమూరు సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టీలకు మట్టి తరలిస్తుండగా 7 ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎస్ఐ టి.రామకృష్ణ, పోలీసుల సహాయంతో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను కరప పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులతో తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల పొలాల్లో మెరక, పల్లాలు తీసుకోవడానికి ముందుగా అర్జీ పెట్టుకోవాలని, అనుమతులు ఇచ్చిన తర్వాతే మట్టి తవ్వకాలు చేపట్టాలన్నారు. అనధికారికంగా మట్టిని తరలిస్తున్న కారణంగా సదరు 7 ట్రాక్టర్లకు ఒక్కొక్కదానికి రూ 3 వేల చొప్పున అపరాధ రుసుం వసూలు చేసి, ట్రాక్టర్లను వదిలేశారు.

పేదలకు అన్నదానం

కాకినాడ సిటీ: జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్, తారక్ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద 500 మందికి అన్నదానం చేశారు. అలాగే ఓ రోగికి ఎన్టీఆర్ ఫ్యాన్స్ సభ్యులు రూ.20 వేల సాయం చేశారు. స్టేట్ కో ఆర్డినేటర్లు భాస్కర్ చౌదరి, రాయుడు బాబ్జీ, జిల్లా కార్యదర్శి కసిరెడ్డి శివనాయుడు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాకినాడ శ్రీను, యూత్ సభ్యులు మధు, కామేష్, దావిడ్ పాల్గొన్నారు.

చల్లని చిరుగాలి వీచే..



సర్పవరం జంక్షన్‌లో మేఘావృతమైన ఆకాశం

కాకినాడ రూరల్: వేసవిలో చల్లని గాలులు జనానికి ఆహ్లాదాన్ని పంచాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం హెచ్చరికల నడుమ ఇప్పటికే ఉపరితల ఆవర్తనంతో వాతావరణం చల్లబడింది. చిరు జల్లులు కూడా పడుతుండడంతో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం ఉదయం ఎండ కొద్దిసేపు ఉన్నప్పటికీ తరువాత వాతావరణం మారింది. 34 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏదేమైనా చల్లని వాతావరణం ప్రజలకు ఊరటనిచ్చింది.

'మామిడి' ఓ ఔషధం



ఇప్పుడంటే మామిడి పండును విషతుల్యం చేశారు గానీ, ఇది పోషకాలకు నెలవు. ఈ మామిడిపండులో ఎముకల బలం పెరగడానికి ఉపకరించే కాల్షియం అధికంగా ఉంటుంది. ఇందులో ఉండే మెగ్నీషియం, పొటాషియం అధిక రక్తపోటును నివారిస్తాయి. విటమిన్ సీ, ఫైబర్‌లు జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. పెప్టిన్ శరీరంలో పేరుకున్న హానికర కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. ప్రొస్టేట్, రక్త క్యాన్సర్ల నివారణలో మామిడిపండ్లది ఎనలేని పాత్ర. ఇలా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ఆర్గానిక్ విధానంలో పండించిన సహజ ఉత్పత్తులకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలి.

–డాక్టర్ గౌరీశేఖర్, ఆర్థోపెడీషియన్, కాకినాడ

అనేక ఆరోగ్య సమస్యలు



కాల్షియం కార్బైడ్‌తో మగ్గించిన మామిడి పండ్లు తినడం వల్ల వినియోగదారులకే కాదు, ఈ పాపానికి ఒడిగట్టే వారికీ ప్రమాదమే. ఆరోగ్యానికి అత్యంత చేటు చేసే ఆర్సెనిక్, పాస్ఫరస్ వంటి హానికారక రసాయనాలు ఈ పండ్లకు అంటుకొని ఉంటాయి. ఈ రసాయనం పండ్లను తినేవారికే కాకుండా పండించేవారికి కూడా ఆరోగ్య సమస్యలను తెచ్చి పెడుతుంది. కళ్లలో మంట, గొంతు నొప్పి, మంట, నీరసం, వాంతులు, చర్మ సమస్యలు, ఛాతిలో మంటకు కారణమవుతాయి. కాల్షియం కార్బైడ్ ఉద్ధార రసాయనాలు కొన్ని క్యాన్సర్‌లకు దారితీస్తాయి.

–డాక్టర్ యు.సుధీర్, విశ్రాంత ఆర్ఎంఓ, జీజీహెచ్

వాటి విక్రయాలకు దూరం



సాధారణంగా ఏప్రిల్ మధ్య నుంచి సీజన్ మొదలై జూన్ మధ్య వరకూ కొనసాగుతుంది. దాదాపు ఇంకో నెల రోజుల పాటు విక్రయాలు కొనసాగుతాయి. అయితే ఈ ఏడాది ఎండలు మామిడిపండ్ల రాకను కాస్త ఆలస్యం చేశాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా పంట దిగుబడి బాగా తగ్గింది. మార్కెట్‌ను కార్బైడ్ కాయలు ముంచెత్తుతున్న విషయం వాస్తవమే. ప్రజల ఆరోగ్యం తన వారి ఆరోగ్యంగా భావించే మాలాంటి ఎందరో వ్యాపారులం ఈ కాయల విక్రయానికి దూరంగా ఉంటున్నాం.

–బి.రాంబాబు, మామిడిపండ్ల వ్యాపారి, కాకినాడ

ప్రజల ఆరోగ్యంతో ఆటలు



మామిడిపండ్లను గతంలోలా అంత ధైర్యంగా కొనలేకపోతున్నాం. హానికారక రసాయనాలు ఈ భయానికి కారణం. పిల్లల నుంచి పెద్దల వరకూ ఎంతో ఇష్టంగా తినే ఈ పండ్లు విషతుల్యం అవుతుండడం బాధాకరం. ఆహార నియంత్రణ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఇందులో స్పష్టమవుతోంది. మార్కెట్‌లలో ఎటువంటి తనిఖీలు లేవు. వీరి నిర్లక్ష్యాన్ని సొమ్ము చేసుకుంటున్న కొందరు స్వార్థపూరిత వ్యాపారుల వ్యవహారం ఇష్టారాజ్యం అయిపోయింది. వ్యాపారుల ఆగడాలను నియంత్రించడంలో అధికారులు చొరవ చూపాలి.

–ముత్తా రావుసాహెబ్ సర్వారాయుడు, కాకినాడ

సమాచారం ఇవ్వండి



రసాయనాల ద్వారా పక్వానికి తెచ్చిన పండ్ల విక్రయం పూర్తిగా చట్టవిరుద్ధం. ఇటువంటి చర్యలకు కఠిన శిక్షలు ఉంటాయి. తనిఖీలు ముమ్మరం చేస్తున్నాం. ప్రజలు మామిడిపండ్లు కొనే విషయంలో అప్రమత్తంగా ఉండాలి. కొన్ని శాస్త్రీయ విధానాల్లో గుర్తించి మాత్రమే తినాలి. అమ్మేవారిపై అధికారులకు సమాచారం ఇవ్వాలి. వివరాలు గోప్యంగా ఉంచుతాం.

–బి.శ్రీనివాస్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా

రంగు భలే... ఆరోగ్యం గుల్లే

- విషతుల్యంగా మధుర ఫలం
- హానికారక రసాయనాలతో పక్వానికి మామిడిపండ్లు
- స్వార్థ వ్యాపారుల చేష్టల ఫలితం



కాకినాడ మెక్లారిన్ గ్రౌండ్ వద్ద విక్రయానికి సిద్ధంగా ఉంచిన మామిడిపండ్లు



తెల్లని కార్బైడ్ మచ్చలతో కనిపిస్తున్న మామిడిపండ్లు

కాకినాడ క్రైం: మధురఫలం విషతుల్యం అవుతోంది. పండ్లలో రారాజుగా కీర్తి గడించిన మామిడిపండు హానికారక రసాయనాలతో ఉక్కిరిబిక్కిరవుతోంది. కమ్మదనాన్ని ఆస్వాదిస్తూ మామిడిని తింటున్న ప్రజలు దీర్ఘకాలిక రోగాల బారిన పడుతున్నారనేది పరిశోధనల్లో వెల్లడైన నిజం. మామిడి పండ్లంటే ఇష్టపడని వారంటూ ఉండరు. అటువంటి వారి బలహీనతను ఆసరాగా తీసుకొని స్వార్థ వ్యాపారాలు పురివిప్పుతున్నాయి. రసాయనాలలో మగ్గించి పక్వానికి తెచ్చిన మామిడిపండ్లను వందలాది రూపాయలకు విక్రయిస్తున్నారు. కాకినాడ సహా ప్రధాన ప్రాంతాల్లో వీటి విక్రయాల కోసం ప్రత్యేక మార్కెట్లు, స్టాళ్లు ఏర్పాటయ్యాయి. అవికాక తోపుడు బండ్లు, సైకిళ్లపై బుట్టలతో విక్రయించే వ్యాపారాలకు లెక్కేలేదు. తాజాగా మార్కెట్‌లో లభ్యమవుతున్న మామిడి పండ్లలో కనీసం 70 శాతం పండ్లు రసాయనాలతో పక్కానికి వచ్చినవే. వ్యాపారి ముందుగానే చెట్టు నుంచి కాయలు తుంచడం వల్ల అవి ముగ్గవు. దీంతో కాల్షియం కార్బైడ్ వినియోగం అనివార్యం అవుతుందని చెబుతున్నారు. ఈ యాసిడ్ తాకిడికి పండ్లు రసాయన చర్యలకు లోనై బలవంతంగా పక్వానికి వస్తాయి.

రసాయనాలతో ముగ్గించిన పండ్లను ఇలా గుర్తించండి

- సహజంగా పండిన మామిడిపండు తొడిమ దగ్గర కమ్మటి సువాసన వస్తుంది. రసాయనాలతో మగ్గించిన పండ్లకు అలా రాదు.
- కార్బైడ్ వాడిన పండ్లు రంగుమారినా గట్టిగా ఉంటాయి. అవే సహజంగా పండినవి మెత్తగా ఉంటాయి.
- ముదురు ఎరుపు లేదా పసుపు రంగులో సహజసిద్ధ పండ్లు ఉంటే కార్బైడ్ వాడిన పండ్లు పూర్తి పసుపు లేదా పచ్చ, పసుపు రంగులు కలసి ఉంటాయి.
- పండ్ల లోపల పూర్తిగా మెత్తగా ఒకే రుచిలో ఉంటే అది సహజ మామిడి, అదే లోపల టెంకను సమీపిస్తున్న కొద్దీ గట్టిగా ఉంటూ పులుపు ఉంటే అది కార్బైడ్‌తో మగ్గించవని గుర్తించాలి.
- రసాయనంతో పండించిన పండ్లు చూస్తే తెల్లని పొడితో కూడిన కార్బైడ్ మచ్చలు ఉంటాయి.
- సహజంగా పక్వానికి వచ్చిన మామిడిపండు నీటిలో వేస్తే మునుగుతుంది. అదే రసాయనాలు వినియోగించిన పండించిన మామిడి పండ్లు నీటిలో తేలుతాయి.

దృఢ సంకల్పంతో సాగితే విజయం



హాజరైన ఎన్‌సీసీ క్యాడెట్లు



శిక్షణలో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిబిరంలో భాగంగా సోమవారం ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఆంధ్ర, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఐడీఎస్ఎస్‌సీ 2024కు ఎంపికైన క్యాడెట్ల శిక్షణ శిబిరంలో భాగంగా పెద్దాపురంలో ప్రముఖ గైనకాలజిస్ట్ విజయలక్ష్మి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కాకినాడ 18వ ఆంధ్రా బెటాలియన్, కమాండెంట్ కల్నల్ వివేక్ సావన్ గౌడర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దృఢసంకల్పం, ఆత్మ విశ్వాసంతో సాగితే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చన్నారు. ఎన్‌సీసీతో మంచి భవిష్యత్తు ఉంటుదన్నారు. క్యాడెట్లు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సురక్షిత జీవనాన్ని సాగించాలని అన్నారు. ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం వేసవి శిక్షణ

పెద్దాపురం: శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం ప్రథమ శ్రేణి గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వచ్చే నెల 11వ తేదీ వరకూ నిర్వహించే తరగతుల్లో భాగంగా సోమవారం శిక్షణ తరగతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, జి.లక్ష్మీ నారాయణ మాట్లాడారు.

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న పిఠాపురం ఆర్వో రామ్‌సుందర్‌రెడ్డి



కౌంటింగ్ ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఆర్వో వెంకటరావు

పర్యవేక్షించిన ఆర్వో వెంకటరావు

కాకినాడ: వచ్చే నెల 4న జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లను కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు సోమవారం పర్యవేక్షించారు. కౌంటింగ్ కోసం ఏర్పాటు చేయాల్సిన టేబుళ్లు, విధుల్లో ఉండే సిబ్బందికి కల్పించాల్సిన సౌకర్యాలు, ఇతర అంశాలపై ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు సూచనలు ఇచ్చారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్వో చెప్పారు. ఆయన వెంట నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, ఏఈ రమేష్‌బాబు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ నాయుడు, సర్వేయర్ ఆచార్యులు తదితరులు ఉన్నారు.

- స్థానిక జేఎన్టీయూకే ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్‌లను ఆర్వో వెంకటరావు సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పర్యవేక్షణకు ఇద్దరు గెజిటెడ్ అధికారులను కూడా నియమించామని, మూడంచెల భద్రతతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు.

ఏజెంట్ల వివరాలు తెలపండి

ఎన్నికల కౌంటింగ్‌కు హాజరయ్యే ఏజెంట్ల వివరాలను కనీసం 10 రోజుల ముందే తమకు తెలిపాలని సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వెంకటరావు సూచించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి తరపు ప్రతినిధులతో సమావేశమయ్యారు. కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్‌కు హాజరయ్యే అభ్యర్థుల తరపు ఏజెంట్లకు సంబంధించిన సమాచారాన్ని ముందుగా తెలియజేస్తే విచారణ అనంతరం వీరికి పాస్‌లు అందజేస్తామన్నారు. వచ్చేనెల 4న ఉదయం తొలుత పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కిస్తామని, సమాంతరంగా ఈవీఎంల లెక్కింపు ప్రారంభిస్తామని చెప్పారు. డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఏఆర్ఓ చల్లన్నదొర, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్లు, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

కాకినాడ సిటీ: పిఠాపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి కాకినాడ జేఎన్టీయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలోని ఈవీఎంలు, ఇతర సామగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు స్ట్రాంగ్ రూమ్‌కు వెళ్లి అక్కడ భద్రతను పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కుట్టిందో మటాష్..!

- డెంగీపై వైద్య సిబ్బంది అప్రమత్తం
- గ్రామాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు
- దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచన



గొల్లప్రోలు మండలంలో డెంగీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం. అపరిశుభ్రత, ఇళ్ల వద్ద మురికి నీరు నిల్వ ఉండడం వలన దోమలు వ్యాప్తి చెంది పలు రకాల వ్యాధులకు కేంద్ర బిందువుగా మారుతుంటాయి. వాటిలో అత్యంత ప్రమాకరమైన డెంగీ వ్యాధి ప్రస్తుత వేసవిలో ఎక్కువగా ప్రబలే అవకాశం ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది గ్రామాల బాట పట్టారు. టైగర్ దోమ, పులి చార దోమతో జర జాగ్రత్తగా ఉండాలని వైద్య సిబ్బంది ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. జాతీయ డెంగీ నివారణా దినోత్సవం సందర్భంగా గత వారం రోజులుగా డెంగీ వ్యాప్తిపై వైద్య సిబ్బంది ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మండుటెండలో గ్రామాల్లో తిరుగుతున్న వైద్య సిబ్బంది డెంగీ దోమ వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

డెంగీ లక్షణాలు

టైగర్, పులిచార దోమలు నీరు నిల్వ ఉన్న చోట్ల గుడ్లు పెడతాయి. డెంగీ హెమరేజిక్ ఫీవర్, డెంగీ హెమరేజిక్ షాక్ సిండ్రోమ్ అనే ప్రమాదకరమైన జ్వరాలు ఈ దోమలు కుట్టడం వల్ల సంభవిస్తాయి. ఈ వ్యాధి సోకినప్పుడు హఠాత్తుగా తీవ్రమైన జ్వరం వస్తుంది. కళ్లు కదిలించలేని పరిస్థితి, ఎముకలు, కండరాల్లో భయంకరమైన నొప్పి, శరీరంపై పొక్కులు వస్తాయి. వాంతులు వికారంతో కూడిన మలవిసర్జన, వివిధ శరీర బాగాల్లో రక్తస్రావం వంటివి కనిపిస్తాయి.

ఎలా వ్యాపిస్తుందంటే...

ఈ వ్యాధి సూక్ష్మ వైరస్, ఎడిస్ దోమ, చిన్నగా నల్లని చారలు కలిగిన దోమలు (టైగర్ దోమలు) కుట్టడం వలన వ్యాప్తి చెందుతుంది. ఇళ్లు, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే ఈ దోమలు వ్యాప్తి చెందుతాయి. ఈ దోమలు పగలు, రాత్రి ఎప్పుడైనా కుడతాయి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి రక్త పరీక్ష (ఎస్ఐవీ) చేయించుకోవాలి. ఈ వ్యాధి నివారణకు చికిత్స లేదు కాని లక్షణాలు బట్టి వైద్య సేవల ద్వారా తగ్గించే అవకాశాలు ఉన్నాయి. ఈ వ్యాధి సోకితే వెంటనే చికిత్స చేయించకుండా నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ప్రమాదం.

నివారణా చర్యలు ఇలా..

- దోమ తెరలు వాడడం
- ఇంటి కిటీకీలకు తలుపులకు జాలీలు వాడడం
- ఇంటి లోపల, బయట నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం
- నీటి తొట్టెలను శుభ్రం చేసుకోవడం
- నీరు నిల్వ ఉండే ఖాళీ డబ్బాలు, కొబ్బరి చెక్కలు వంటివి ఇళ్ల మధ్య లేకుండా జాగ్రత్త పడడం
- వాటర్ బాటిల్స్, వస్తువుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం,
- పూల కుండీలు, ఎయిర్ కూలర్లలో ఎప్పటికప్పుడు నీరు మార్చుకోవడం
- దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్, మందులు పిచికారీ చేయడం వంటి చర్యలు తీసుకోవడం ద్వారా నివారించవచ్చు.

సంబరాలకు సిద్ధం కండి

- వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశాలు



పిఠాపురంలో నాయకులతో మాట్లాడుతున్న వంగా గీత

పిఠాపురం: నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్ సీపీ గెలుపును ఎప్పుడో నిర్ణయించేశారు.. ఇక ఫలితాలు రావడమే తరువాయి విజయోత్సవ సంబరాలకు సిద్ధం కండి అని ఆ పార్టీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత పిలుపునిచ్చారు. గత రెండు రోజులుగా ఆమె పిఠాపురం క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తూ గ్రామాల్లో పోలింగ్ సరళిపై ఆయా గ్రామాల నాయకులతో చర్చిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిఠాపురంలో ఒక కుటుంబ సభ్యురాలిగా స్థానిక ప్రజలందరూ తనపై ఎనలేని అభిమానం చూపి ఎన్నికల్లో గెలిపిస్తున్నారని, వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాదరణే తన గెలుపును తెలియజేస్తోందన్నారు. ప్రజలందరూ తనకు సంపూర్ణ మద్దతు ఇచ్చారన్నారు. ఇప్పటికే పిఠాపురంలో ఎంతో అభివృద్ధి చేశానని, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా మరింత అభివృద్ధి చేస్తానన్నారు. పిఠాపురాన్ని రాష్ట్రంలో ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి సీఎం వైఎస్‌జగన్ పూర్తి సహకారం అందిస్తారని, ఆయన ఇప్పటికే తనకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తానని ప్రకటించడమే ఇందుకు నిదర్శమన్నారు. కార్యక్రమాల్లో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

కరప: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి తీవ్ర గాయాలవ్వగా కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన మేడిశెట్టి నాగబాబు టైల్స్ పనిచేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం నాగబాబు కరప వచ్చి పని ముగించుకుని మోటార్ సైకిల్‌పై తిరిగి వెళ్తుండగా పెనుగుదురు వంతెన దిగువన ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగబాబు తలకు తీవ్ర గాయమైంది. అతన్ని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు తల్లి మేడిశెట్టి లక్ష్మీనరసమ్మ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఎస్ఐ టి.రామకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి శ్యామలాంబ జాతర

సామర్లకోట: మండలంలోని అచ్చంపేట గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవత శ్యామలాంబ జాతర ఉత్సవాలు ఈ నెల 22 నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొలి రోజు జాతరను పురస్కరించుకుని వివిధ సాంస్కృతిక ప్రదర్శనతో ఉత్సవం జరుగుతుందన్నారు. 23న ఆలయం వద్ద తిరునాళ్ల జరుగుతాయన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ఆంక్షలు

కొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పలు చోట్ల ఘర్షణలు, అల్లర్లు జరిగిన నేపథ్యంలో ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని పెట్రోల్ బంక్‌ల్లో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ఆంక్షలు విధించినట్టు స్థానిక ఎస్సై స్వామినాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని కొండెవరం, ఉప్పాడ, అమీనాబాద్, కొత్తపల్లి, శ్రీరాంపురం బీచ్ రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకుల్లో ఖాళీ బాటిల్స్, డబ్బాల్లో పెట్రోలు కొట్టవద్దని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసుల సూచనలు తూ.చా. తప్పకుండా పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన పెట్రోల్ బంకుల యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లోని కిరాణా షాపుల వద్ద పెట్రోల్, డీజిల్ అమ్మకాలు చేయరాదన్నారు. నిబంధనలను అతిక్రమించి గ్రామాల్లో ఎవరైనా బాటిళ్ల, డబ్బాల్లో పెట్రోల్ విక్రయిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బంకుల యజమానులతో పాటు కిరాణా షాపుల యజమానులు నిబంధనలు పాటించాలని సూచించారు.